రక్షణ కరవై... కర్రలే ఊతమై



పులివెందుల అభివృద్ధిని గత వైకాపా పాలకులు పూర్తిగా విస్మరించారు. అభివృద్ధి పనులు ప్రారంభించి నిధుల లేమితో మధ్యలోనే వదిలేశారు. దీంతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా రాణితోపు నుంచి ఉలిమెల్ల చెరువు వరకు ఉన్న వంకకు ఇరువైపులా రక్షణగోడ నిర్మాణం చేపట్టారు. నిధుల లేమితో గరండాల్ వంతెన నుంచి యర్రగుడిపల్లెకు వెళ్లేదారిలో ఉన్న వంకకు నిర్మించే రక్షణ గోడ అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. రెండు రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి కొంతమేర రోడ్డు దెబ్బతింది. దీంతో స్థానికులు కర్రల సాయంతో తాత్కాలిక రక్షణ ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి వేళల్లో ఈ మార్గంలో వెళ్లేందుకు వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రక్షణగోడ పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పులివెందుల (వేముల)**

టెట్‌కు 1,495 మంది హాజరు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రాల్లో ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) (కంప్యూటర్ బేస్ట్ టెస్ట్) శనివారం కొనసాగింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,680 మందికి 1,495 మంది హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి అనూరాధ తెలిపారు.

తెదేపా కడప నగరాధ్యక్షుడిపై దాడి

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : తెదేపా కడప నగరాధ్యక్షుడు సానపరెడ్డి శివకొండారెడ్డిపై శనివారం గుర్తుతెలియని దుండగులు కర్రలతో దాడికి పాల్పడ్డారు. అధికార పార్టీకి చెందిన నగరాధ్యక్షుడిపై పట్టపగలు కర్రలతో దాడులకు పాల్పడడం చర్చనీయాంశమైంది. ఘటనలో ఆయన తలకు బలమైన గాయమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. దుండగులు ద్విచక్రవాహనాలపై వచ్చి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. కడప పాత రిమ్స్ చిన్నచౌకు సమీపంలో నివసించే తెదేపా నగరాధ్యక్షుడు శివకొండారెడ్డి శనివారం ఉదయం మాసాని కల్యాణమండపం సమీపంలో కూరగాయలు తీసుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. ఆయనను కొద్ది దూరం నుంచి రెండు ద్విచక్రవాహనాల్లో నలుగురు దుండగులు అనుసరించారు. చిన్నచౌకు రాణాకు సమీపంలోకి రాగానే శివకొండారెడ్డి వాహనాన్ని ఆపి తమ వెంట తెచ్చుకున్న కర్రలతో దాడి చేశారు. తల వెనుక బలంగా కొట్టడంతో తీవ్ర గాయమైంది. దుండగులు అక్కడి నుంచి వాహనాల్లో పరారయ్యారు. స్థానికులు గమనించి ఆయనను ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, తెదేపా నాయకులు అమీర్‌బాబు, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పరామర్శించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి దుండగులు ఉపయోగించిన కర్రలను స్వాధీనం చేసుకున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆయన ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.



తీవ్రంగా గాయపడిన సానపురెడ్డి శివకొండారెడ్డి



ద్విచక్రవాహనంపై పరారవుతున్న దుండగులు

అమ్మాయిలపై అఘాయిత్యాలు!



అమ్మాయిల ప్రాణ, మానాలకు రక్షణ లేకుండాపోతోంది. వీరిపై ఏదోఒక చోట అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రేమ పేరిట వేధింపులు, ఆపై ఘాతుకాలు పెరిగిపోతున్నాయి. చిన్నారులపైనా లైంగిక దాడులు కొనసాగుతున్నాయి. ఫలితంగా తల్లిదండ్రులకు గర్భశోకం మిగులుతోంది. తమ పిల్లల భద్రతపై వారు భయాందోళనకు గురవుతున్నారు. యువకులు తమ వికృత చేష్టలతో నేరాలకు ఒడిగడుతున్నారు. వైఎస్ఆర్ జిల్లా బద్వేలులో శనివారం జరిగిన ఉదంతమే ఇందుకు నిదర్శనం. ఈ ఘటనలో నిందితుడికి భార్య ఉంది. అందులోనూ గర్భవతి కూడా. ఈ తరుణంలో యువకుడు ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక వెంటపడుతూ వేధిస్తూ పెట్రోలు పోసి నిప్పంటించాడు. కళాశాలలో ఉన్న అమ్మాయిని బెదిరించి బలవంతంగా బయటకు తీసుకెళ్లి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో గత రెండేళ్లలో చోటుచేసుకున్న దుర్ఘటనలతో అమ్మాయిలు, బాలికల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. **- ఈనాడు, కడప**

బి.కోడూరులో యువతి హత్య

బి.కోడూరు మండలానికి చెందిన ఓ డిగ్రీ విద్యార్థిని సిద్దవటం మండలం పెన్నానదిలో శవమై తేలింది. కళాశాలకు వెళ్లిన విద్యార్థినిని కొందరు యువకులు సిద్దవటం కోటకు తీసుకెళ్లారు. ఆ తర్వాత అమ్మాయి కనిపించలేదు. పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతోపాటు అనుమానిత యువకుల పేర్లను సూచించారు. మూడు రోజుల అనంతరం నదిలో శవమై తేలింది. ఈ కేసును రాజకీయ కారణాలతో ముందుకు సాగకుండా నిలిపివేశారు. అప్పట్లో పోలీసుల తీరుపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటన కూడా ప్రేమ పేరుతోనే విషాదంగా మారింది.

కురబలకోటలో ఆరేళ్ల బాలిక హత్య

కురబలకోటలో ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి ఆపై హత్య చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంలో అప్పట్లో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఘటనపై సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన సైతం చేపట్టాయి. నిందితుడిని బహిరంగంగా ఉరితీయాలంటూ డిమాండు చేశాయి. ఈ ఘటన స్థానికంగా పెద్దఎత్తున కలకలం రేపింది.

బద్వేలులో కొడవలితో నరికి...

బద్వేలు గ్రామీణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ అమ్మాయిని (19) తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలంటూ ఓ యువకుడు వేధిస్తూ తన ఇద్దరి స్నేహితులతో కలిసి హత్య చేశాడు. తల్లిదండ్రులతో కలిసి పొలం పనులు చేసుకుంటున్న యువతిపై కొడవలితో నరికి చంపేశారు. తల్లిదండ్రులను వ్యతిరేకించి తాను వ్యవహరించలేనడంతో ఆగ్రహంతో చరణ్ అనే యువకుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఇతడికి సహకరించిన రసూల్, నరసింహలు జైలు పాలయ్యారు. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఆ యువతి నిండు ప్రాణాలు కోల్పోయింది.

పులివెందులలో చిన్నారిపై అత్యాచారం

ముక్కుపచ్చలారని ఓ బాలికపై ఓ బాలుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలంలో చోటుచేసుకుంది. ఓ దంపతులు చిన్నపాటి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి చెందిన మేక పిల్ల చనిపోయింది. కళేబరాన్ని పారవేయడానికి వీరి కుమార్తె ఊరిబయట ఉన్న కంప చెట్ల వైపు వెళ్లింది. ఈ సమయంలో బాలికను అనుసరించిన ఓ బాలుడు (16) కళేబరాన్ని ఇక్కడ పడేస్తే దుర్వాసన వస్తుందని, ఇంకొంచెం దూరం వెళ్లి పడేయాలని చెప్పి మరింత దూరం తీసుకెళ్లాడు. అక్కడ బాలిక అరవకుండా దుస్తులు ఊడదీసి నోట్లోకి కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో ఆమె అత్త ఘటనాస్థలికి వెళ్లింది. ఆమెను చూసిన నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే ఆమె తన మేనకోడలిని ఇంటికి తీసుకెళ్లింది. అనంతరం బాలిక కడుపునొప్పి తాళలేకపోవడంతో తల్లిదండ్రులు ఆసుపత్రిలో చేర్పించారు. బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

మదనపల్లెలో ప్రేమ పేరిట దారుణం

మదనపల్లెలో ఓ యువతిని ప్రేమ పేరుతో కిరాతకంగా హత్య చేశారు. ముగ్గురు యువకులు కలిసి యువతిని నమ్మించి చీకటి ప్రాంతానికి తీసుకెళ్లి దారుణానికి ఒడిగట్టారు. ముగ్గురు నిందితుల్లో ఒకరు పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి చివరకు ప్రాణాలు తీసేశారు. ఎందుకు చంపారనే విషయం బయటకు రాకుండానే దారుణం కాలగర్భంలో కలిసిపోయింది.

పీబీఆర్‌కు జలకళ



ఎగువన కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకల ద్వారా పెంచికల బసిరెడ్డి జలాశయంలోకి (పీబీఆర్) 590 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం 240 క్యూసెక్కుల నీరు చేరింది. భారీ వర్షాలు కురవడంతో జలాశయంలోకి వరద పెరిగింది. ప్రాజెక్టులో ప్రస్తుతం 7.3 టీఎంసీల నీరు నిల్వ ఉందని పీబీసీ ఈఈ రాజశేఖర్ తెలిపారు. **- లింగాల, న్యూస్‌టుడే**

సమష్టి కృషితోనే మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట



కడప నగరంలోని ఏడురోడ్ల కూడలిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే : మానవ అక్రమ రవాణా అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కడప ఒకటో పట్టణ ఎస్ఐ అమర్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు వాక్ ఫర్ ఫ్రీడం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్టెల్లా షర్మిలారాణి, మీకోసం విష్ణువర్ధన్, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, స్టెప్ సిబ్బంది, ఎన్‌వైకే వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచు దుప్పట్లో మైదుకూరు



అల్పపీడనం ప్రభావంతో మూడురోజులపాటు కురిసిన వర్షాలతో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా శనివారం మైదుకూరును మంచుదుప్పటి కప్పేసింది. పొలాలు, చెట్లు, రహదారులపై పొగమంచు తెరలు కనిపించడంతో ఆకర్షణగా మారింది. విశాఖపట్నం లంబసింగిని తలపించేలా పరిసరాలు కనిపించడంతో స్థానికులు ప్రత్యేక అనుభూతి పొందారు. వాహనదారులు తెల్లవారుజాము నుంచి ఉదయం 7 గంటల వరకు వాహనాల వెలుతురు మధ్య రాకపోకలు సాగించారు. **- న్యూస్‌టుడే, మైదుకూరు**

బిందు, తుంపర సేద్య పరికరాల మంజూరుకు చర్యలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో నీటి వసతి ఉన్న రైతులను గుర్తించి వారికి బిందు, తుంపర సేద్య పరికరాలు మంజూరు చేయించాలని ఏపీ సూక్ష్మనీటి సాగు పథకం పథక (బాధ్య) సంచాలకుడు మురళీమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం 2024-25 ఏడాదికి జిల్లాకు 31,500 హెక్టార్లలో పరికరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యం ఇచ్చారన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు 1,679 హెక్టార్లకు పరిపాలన అనుమతులు ఇచ్చామన్నారు. దరఖాస్తు చేసుకోని రైతుల్లో నీటి వసతి ఉన్నవారిని గుర్తించి అవగాహన కల్పించి పరికరాలు మంజూరు చేయించాలన్నారు. సమావేశంలో ఎంఐ ఇంజినీరు, పరికరాల సంస్థల ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆశల వంతెన... సాకారమయ్యేనా?

ఏళ్లుగా రాకపోకలకు తప్పని పాట్లు
కమలాపురం పట్టణ వాసుల దుస్థితి
ఎన్డీయే ప్రభుత్వంపైనే గంపెడాశలు

- న్యూస్‌టుడే, కమలాపురం


కమలాపురం పట్టణంలో రైల్వే గేటు కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి 5 నిమిషాలకోసారి గేటు పడటంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అవస్థలు పడుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో వంతెన నిర్మాణం అటకెక్కింది. ప్రస్తుతం ఎన్డీయే తరఫున కమలాపురం ఎమ్మెల్యేగా పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ఎన్నికవడంతో రైల్వే పైవంతెన కల సాకారమవుతుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారడం తప్ప ఏ నాయకుడు కూడా పైవంతెన నిర్మాణానికి కృషి చేసిన దాఖలాల్లేవు. గేటు పడిన ప్రతిసారి ఇరువైపులా కిలోమీటరు మేర వాహనదారులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి రైల్వే పైవంతెన నిర్మించేందుకు కృతనిశ్చయంతో ఉన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి రైల్వేగేటు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి వారు పైవంతెన నిర్మాణానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని సానుకూలంగా స్పందించారు. ఇటీవల రహదారులు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి వంతెన నిర్మాణానికి సంబంధించి ఆచరణ సాధ్యమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడంతో వారు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కేంద్రంలోని భాజపా సహకారంతో పైవంతెన నిర్మాణం పూర్తవుతుందని ప్రజలు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.



రైల్వేగేటు పడడంతో వేచి ఉన్న వాహనదారులు



హామీలివ్వడం తప్ప చేసిందేమీ లేదు ; ఎన్నికల సమయంలో రైల్వే పైవంతెన నిర్మిస్తామని నాయకులు హామీలివ్వడం తప్ప నిర్మించిన దాఖలాల్లేవు. వంతెన నిర్మిస్తామని మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చి నెరవేర్చలేదు. అనంతరం ఎన్నికైన ఎమ్మెల్యేలు హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారే తప్ప పనులు మాత్రం ప్రారంభించలేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేసి వదిలేశారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు భూమిపూజ చేశారు తప్ప పనులు ప్రారంభించిన దాఖలాల్లేవు. ప్రతి 5 నిమిషాలకోసారి గేటు పడుతుండటంతో వాహనదారులు, ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటే మా కష్టాలు తీరతాయి. **- జయరామిరెడ్డి, పాచికలపాడు**




ఆశలన్నీ ఎమ్మెల్యేపైనే : ప్రతి 5 నిమిషాలకోసారి గేటు పడుతుండటంతో ఇరువైపులా వాహనదారులు బారులు తీరుతున్నారు. ఒక్కోసారి గేటు తెరవాలంటే సుమారు 10 నుంచి 20 నిమిషాల సమయం పడుతోంది. మరో ప్రత్యామ్నాయ దారి లేదు. గతంలో అధికార, ప్రతిపక్ష నాయకులు రైల్వే పైవంతెన నిర్మిస్తామని హామీలు ఇవ్వడం తప్ప చేసిందేమీ లేదు. దీంతో నిత్యం నరకం అనుభవిస్తున్నాం. ఎన్నికల ముందు ఏదో చేస్తున్నామన్నట్లు హంగామా చేయడం, కొలతలు తీయడం, నమూనాలు సేకరించడం, తర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారింది. ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి రైల్వే పైవంతెన నిర్మించేందుకు ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌తో పాటు రైల్వే అధికారులను కలిసి విన్నవించారు. ఈ అయిదేళ్లలో ఎలాగైనా పైవంతెన నిర్మించి తీరతారనే నమ్మకం ఉంది. **- శివరామిరెడ్డి, కమలాపురం**

23న జడ్పీ సర్వసభ్య సమావేశం

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగరంలోని జిల్లాపరిషత్తు కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈవో చిలమకూరు ఓబులమ్మ తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని జడ్పీటీసీసభ్యులు, ఎంపీపీలు హాజరుకావాలని కోరారు. సంబంధిత అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి సీఎంకు వినతి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : కడప నగరంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఎమ్మెల్యే మాధవి శనివారం సీఎం చంద్రబాబునాయుడికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు విజయవాడలో సీఎంను కలిసి తాగునీటి సమస్యతో పాటు పలు అంశాలను వివరించారు. కడప నగర వాసుల అవసరానికి కనీసం 20 శాతం మేర తాగునీరు తక్కువగా లభిస్తోందని, వచ్చే వేసవిలో సమస్య మరింత తీవ్రంగా ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మరిన్ని నిధులు కేటాయించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరానని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.



సీఎం చంద్రబాబునాయుడికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

వాగులు... వంకల్లో భూతాలు

పల్లవోలు నుంచి రామసుబ్బమ్మ చెరువులోకి చేరే వంక మార్గానికి అడ్డంగా నిర్మించిన ప్రహరీ



- న్యూస్‌టుడే, చాపాడు

చాపాడు మండలం పల్లవోలు రెవెన్యూ పరిధిలో గత పదేళ్లుగా రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రొద్దుటూరు పట్టణం సమీపం కావడంతో ఎకరా భూమి రూ.కోట్లలో విలువ చేస్తున్నాయి. మైదుకూరు-ప్రొద్దుటూరు రోడ్డుకిరువైపులా కొత్తగా వెంచర్లు, దుకాణాలు వెలిశాయి. అందులో వాగులు, వంకలు, చెరువులున్నా పట్టించుకోకుండా వెంచర్లు వేసి ప్రహరీలు నిర్మిస్తున్నారు. వ్యవసాయ పొలాల్లో భూమార్పిడి జరగకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. పంచాయతీ అధికారులు అక్రమ లేఅవుట్లలో వేసిన సూచికలు లెక్కచేయకుండా తొలగిస్తున్నారు. నిర్మాణాల వద్ద పదిశాతం ప్రజావసరాలకు వదల్లేదు. అధికారులు కేవలం నోటీసులతో సరిపెడుతున్నారు. కోటిరెడ్డి రామసుబ్బమ్మ దంపతులు నిర్మించిన పురాతన చెరువు కింద 1200 ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి నీళ్లు రావాల్సిన వంక చిన్న కాలువలా మారింది. వంక నిండి పొలాల్లో నీరు పారుతున్నాయని స్థానిక రైతులు నేతల వద్ద ఫిర్యాదులు చేస్తే ఎత్తుగా మట్టి తోలిస్తామని పంచాయతీలు జరిగాయి. పల్లవోలు చెరువు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా కేవలం ఓ వైపు కట్టలు మిగిలాయి. 60 శాతం చెరువు ఆక్రమణకు గురైంది. అలుగు ఆనుకుని రోడ్డు నిర్మాణం చేపట్టారు. స్థానిక నేతలు రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యల్లేవు. ఇలాగే వదిలేస్తే భవిష్యత్తులో వాగులు, వంకలు, చెరువులు కనుమరుగయ్యే ప్రమాదముందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడేలా చేస్తున్న పనులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అక్రమ నిర్మాణాలపై జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తహసీల్దారుతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



పల్లవోలు చెరువులో నిర్మించిన రహదారులు

ఉర్దూ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా సచివాలయం : ఉర్దూ అవార్డుల కోసం జిల్లాలోని ఉర్దూ కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి షేక్ ఇమ్రాన్ పేర్కొన్నారు. నవంబరు 11న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ప్రత్యేకంగా పురస్కారాలు అందిస్తున్నామన్నారు. ఈ మేరకు ఈ నెల 25వ తేదీలోగా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

21 నుంచి గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ

కడప ఏడురోడ్లు : కడప నగర శివార్లలోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 21వ తేదీ నుంచి గ్రామీణ నిరుద్యోగ యువకులకు చరవాణి రిపేరింగ్-సర్వీసింగ్, ఫొటోగ్రఫీ-వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు యువకులు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. అవకాశాన్ని గ్రామీణ నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

తొండూరు, న్యూస్‌టుడే : బెంగళూరులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని ఊడవగండ్ల చెందిన దాసరి రేణుక (22) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రేణుక బెంగళూరులోని ఓ ప్రైవేటు సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. శనివారం ద్విచక్రవాహనంపై ఆఫీసుకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. శవపంచనామా బెంగళూరులోనే పూర్తి చేసి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

మేకల కాపరి ఆచూకీ లభ్యం

అట్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని కంచాయిపల్లెకు చెందిన మేకల కాపరి గంగిరెడ్డి ఆచూకీ ఆరు రోజుల అనంతరం శనివారం లభించింది. లంకమల అభయారణ్యంలోని గుబ్బకోన వద్ద తిరుగుతుండగా వరికుంట ప్రజలు గుర్తించారు. మేకలు ఇంటికి చేరిన సంగతి గంగిరెడ్డికి తెలియక అడవిలో నీళ్లు తాగుతూ తను తీసుకెళ్లిన మేకలను వెతుకుతూ ఇంటి కొచ్చే దారి తెలియక అక్కడే ఉండిపోయారు. రోజు మాదిరే శనివారం సుమారు 100 మంది వరకు అటవీ ప్రాంతంలో వివిధ చోట్ల వెతికేందుకు వెళ్లారు. గుబ్బకోన వద్ద గంగిరెడ్డి స్థానికులకు తటస్థపడి మా మేకలు చూశారా అంటూ వెళ్లిన వారిని పలకరించారు. గంగిరెడ్డిని ప్రాణంతో స్థానికులు చూసి ఆశ్చర్యపోయారు.

పిచ్చికుక్క దాడిలో 20 మందికి గాయాలు

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరులో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. చిన్న పెద్ద అనే తేడా లేకుండా దాదాపు 20 మందిని గాయపరిచింది. పోరుమామిళ్లరోడ్డులోని బ్రహ్మంగారి ఆలయం వద్ద సాయంత్రం దాడి చేసిన కుక్క, అక్కడి నుంచి పట్టణంలో నంద్యాలరోడ్డులోని వెంకటాపురం కూడలి వరకు దారిపొడవునా చాలా మందిని కొరికింది. వెంకటాపురం కూడలిలో తిరుమలకు వెళ్తున్న భక్తులు అల్పాహారం తినేందుకు ఆగగా ఓ బాలుడిపై దాడి చేసింది. వీరు స్థానిక సామాజిక ఆసుపత్రిలో వైద్య సేవలు పొందారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజారోగ్య విభాగ అధికారి పెంచలయ్య కోరారు.

బ్రౌన్ గ్రంథాలయం... జానమద్ది త్యాగఫలం

నేడు హనుమచ్ఛాస్త్రి శతజయంతి వేడుకలు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : తెలుగు భాష కోసం జీవిస్తూ, జీవితాన్ని త్యాగం చేసి సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయం ఏర్పాటుకు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శ్రమించారు. ఆయన కృషికి ప్రతిరూపమే నేటి బ్రౌన్ గ్రంథాలయం. ఎందరో సాహితీవేత్తల నుంచి అరుదైన గ్రంథాలు సేకరించి, బ్రౌన్ గ్రంథాలయాన్ని ఒక గొప్ప విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కింది. గ్రంథాలయ అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారు. ప్రస్తుతం గ్రంథాలయం దేదీప్యమానంగా వెలుగొందుతుందంటే దానికి మూలం జానమద్ది. గ్రంథాలయ స్థాపనకు గాను కాకుండా తెలుగు సాహిత్య రంగాన్ని సుసంపన్నం చేయాలని తపనపడిన కొద్ది మంది తెలుగువారిలో జానమద్ది ఒకరు. నిరంతరం రచనా వ్యాసంగంలో అలుపెరుగక శ్రమించే కలం యోధుడు. జిల్లా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన మహనీయుడు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు.


జానమద్ది విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు (పాత చిత్రం)

రచనలతో ఆదర్శం...

హనుమచ్ఛాస్త్రి స్వయంకృషితో ఎదిగి బ్రౌన్ శాస్త్రి అని అందరూ పిలిచేలా తన జీవితం సాగింది. జానమద్ది కలం రచనే కాకుండా కన్నడం, ఆంగ్లం, అనువాదాలతో కలిపి మొత్తం 2500కు పైగా వ్యాసాలు రాశారు. సాహిత్య అకాడమీ సభ్యుడిగా వ్యవహరించారు. మా సీమకవులు, నాట్యకళాప్రపూర్ణ బళ్లారి రాఘవ (జీవితచరిత్ర), కస్తూరి కన్నడ సాహిత్య సౌరభం, కడప సంస్కృతి-దర్శనీయ స్థలాలు, మన దేవతలు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత చరిత్ర, సీపీ బ్రౌన్ చరిత్ర, మొండి గోడల నుంచి మహాసౌధం దాకా, విదురుడు, త్యాగమూర్తులు, మనిషి నీకు అసాధ్యమేది, ఎందరో మహానుభావులు, భారత మహిళ, శంకరంబాడి సుందరాచారి తదితర మొత్తం 22 పుస్తకాలు వెలువరించారు. 8వ తరగతి తెలుగు వాచకంలో బళ్లారి రాఘవపై ఆయన రచనను పాఠంగా ఉంచారు. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లోనూ ఆయన రచనలు పాఠాలుగా ఉండటం విశేషం.

ప్రముఖులతో సత్కారం...

బ్రౌన్ గ్రంథాలయ ప్రారంభోత్సవం సందర్భంగా 1995లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సత్కారం పొందారు. 1996 జనవరి 25న నాటి భారత ప్రధాని పీవీ నరసింహారావుచే సత్కారం పొందారు. 1996లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందడంతో పాటు అనేక సాహితీ సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నారు.

65 వేలకు పైగా పుస్తకాలు

ప్రస్తుతం సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో మెకంజీ కైఫీయత్తుల 42 సంపుటాల జిరాక్స్ ప్రతులు, బ్రౌన్ లేఖ 17 సంపుటాల నకళ్లు ఉన్నాయి. 65 వేలకు పైగా వివిధ భాషల పుస్తకాలున్నాయి. మూడు వేల పత్రికల ప్రత్యేక సంచికలు, తెలుగు ఎంఫిల్, పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథాలు వందల సంఖ్యలో ఉన్నాయి. 200 ఏళ్లకు పైగా నాటి రాతప్రతులు 205 ఉన్నాయి. ఇక్కడ లభించే పుస్తకాలు ఎక్కడా దొరకవు. వివిధ కట్టెలపై పరిశోధనా పండితులు పుస్తకాలను సూచించడానికి ఇక్కడకు వస్తారు. ఈ కేంద్రం తరఫున మెకంజీ కడప జిల్లా కైఫీయత్తుల 7 సంపుటాల్ని, బ్రౌన్‌పై రెండు వ్యాస సంకలనాల్ని, నన్నెచోడుడు, నాచన సోమన, అన్నమాచార్యులు, అల్లసాని పెద్దన మొదలైన రాయలసీమ ప్రాచీన కవులపై వ్యాససంకలనాల్ని ప్రచురించారు.

ఆయన కృషి వెలకట్టలేనిది



తెలుగుభాషా సాహిత్యానికి ఎనలేని కృషి చేసిన సీపీ బ్రౌన్ స్మారకంగా గ్రంథాలయ నిర్మాణం చేసి బ్రౌన్ కీర్తిని అజరామరం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి. తెలుగు భాషా సాహిత్యాలకు బ్రౌన్ గ్రంథాలయం నిలయంగా ఉంది. ఎందరో పరిశోధకులు, సాహితీప్రియులకు, సాహితీవేత్తలకు సేవలందిస్తూ ఉందంటే అది నాడు ఆయన చేసిన కృషే.

- జానమద్ది విజయభాస్కర్, హనుమచ్ఛాస్త్రి కుమారుడు

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ నేడు


యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న డీఈవో అనూరాధ, నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం స్వర్ణోత్సవ మహాసభ గోడపత్రికలను డీఈవో అనూరాధ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. డీఈవో కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నరసింహారావు, నాయకులు కృష్ణారెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘరానా మోసగాడి అరెస్టు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : మహిళలను నమ్మించి పెళ్లి చేసుకుని మోసం చేస్తున్న ఘరానా మోసగాడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడు కేవలం పెళ్లి చేసుకోవడమే కాకుండా ఉద్యోగాలిప్పిస్తానంటూ పలువురిని మోసం చేశాడు. పోలీసుల వివరాల మేరకు... కడపకు చెందిన చిన్నబోయిన రాము, కడప తాలూకా పరిధిలోని ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి చేసుకున్న కొద్ది రోజులకే యువతిని మోసం చేశాడు. యువతి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు గతంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురిని మోసం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అతడిపై కడప, తాడిపత్రి, ప్రొద్దుటూరులో కేసులు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు.

రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళ గస్తీని ముమ్మరం చేసినట్లు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. కేసుల నమోదు రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. చోరీల నియంత్రణపై నిఘా ఉంచామన్నారు. కడప-రేణిగుంట జాతీయ రహదారిలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. బాలికలు, యువతులు, మహిళలను వేధింపులకు గురి చేసే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. జూదం, మట్కా, క్రికెట్ బెట్టింగ్ స్థావరాలపై సమాచారమిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఒంటిమిట్టలో పోలీసు నివాస గృహాలకు గతంలో కేటాయించిన స్థలం ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. అనంతరం ఒంటిమిట్టలో తితిదే పరిపాలన కార్యాలయంలో రామాలయం భద్రతపై మంగళగిరి ఆక్టోపస్ డీఎస్పీలు పి.జగ్గునాయుడు, ఐ.తిరుపతయ్యలతో కలిసి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. దేశంలో ప్రసిద్ధ ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జన సమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై గతంలో ఉగ్రమూకలు దాడులు చేసినట్లు తెలిపారు. మీ ప్రాంతంలో కొత్త వ్యక్తులు తిరుగుతున్నట్లు అనుమానం ఉంటే తక్షణమే స్పందించి ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించాలని తెలిపారు. సంఘ విద్రోహ శక్తులను కట్టడి చేసేందుకు ఆక్టోపస్ కమాండోలు శ్రమిస్తున్నారని వివరించారు. భద్రత కోసం ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సీఐ కృష్ణంరాజునాయక్, ఉప తహసీల్దారు అంజనా గౌరి, ఎస్.ఐ శివప్రసాద్, వైద్యాధికారిణి హిమ శ్వేత పాల్గొన్నారు.


దస్త్రాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహిళాభ్యుదయంతోనే వికసిత్ భారత్

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : మహిళాభ్యుదయంతోనే 2047 నాటికి వికసిత్ భారత్ సాధ్యమవుతుందని కళాశాలల ఆర్జేడీ డాక్టర్ గిరి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రిన్సిపల్ వి.సలీంబాషా మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆకాంక్ష మేరకు విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి.


మాట్లాడుతున్న ఆర్జేడీ డాక్టర్ గిరి, పక్కన ప్రిన్సిపల్, అధ్యాపకులు

ముగిసిన జిల్లాస్థాయి యోగా ఎంపికలు


రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కడప నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి యోగా ఎంపికలు శనివారం ముగిశాయి. అండర్-14, 17 విభాగంలో జరిగిన పోటీలను జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి బి.అరుణకుమారి ప్రారంభించారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ పోటీలకు ఎంపికవ్వాలని సూచించారు. అండర్-14 బాలుర విభాగంలో వై.క్రాంతిరెడ్డి, ఎస్.ప్రణీత్, బి.బన్ని, పి.మహిధర్, కె.చంద్రఓబుల్‌రెడ్డి, కె.ఆకాశ్, వై.భరత్, ఎ.అశోక్, ఎం.లోహిత్‌రంజన్, ఆర్.నాగసిద్ధార్థ, బాలికల విభాగంలో కె.మనస్విని, వై.నాగసిరి, కె.నందిని, టి.తేజశ్రీ, డి.షస్మి, ఎం.నాగవైష్ణవి, ఎల్.సమతి, యు.హదస్సరాణి, డి.దీపిక, వి.రిషిత ఎంపికయ్యారు.

ఆసక్తికరంగా క్రికెట్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ఏసీఏ అండర్-14 మల్టీడే క్రికెట్ పోటీల్లో భాగంగా వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కర్నూలు, పశ్చిమగోదావరి జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో బౌలర్లు రాణించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన ప.గో జట్టు మొదటి రోజు 76.1 ఓవర్లలో 98 పరుగులకు ఆలౌటైంది. కేపీ.నారాయణ 29, మణికంఠ 17 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు ఎన్.గిరిదరి, హరిహరణ్ చెరో 3 వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశారు.

◆ కేఓఆర్‌ఎం మైదానంలో తూర్పుగోదావరి, ప్రకాశం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తూ.గో బ్యాటర్లు రాణించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన తూ.గో జట్టు మొదటి రోజు 41.2 ఓవర్లలో 112/6 పరుగులు చేసింది. రేవంత్ 32, రాజ్‌ఆర్యన్ 22 పరుగులు చేశారు. ప్రకాశం బౌలర్లు లోకేశ్, ఉదయ్ చెరో 2 వికెట్లు తీశారు.


విద్యార్థిని జైప్రియతో పాఠశాల సిబ్బంది

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ఈనెల 18వ తేదీన జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆర్టీపీపీ డీఏవీ పాఠశాల విద్యార్థినులు జైప్రియ, నేహ ఎంపికైనట్లు శనివారం ప్రిన్సిపల్ శ్రీనివాసగుప్త తెలిపారు. వారు నవంబరు 9, 10, 11వ తేదీల్లో విజయనగరంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయుడు నరేష్‌ను ఆర్టీపీపీ సీఈ గౌరీపతి అభినందినట్లు వివరించారు.

వేలం ద్వారా రూ.81.37 లక్షల ఆదాయం

చక్రాయపేట, న్యూస్‌టుడే : గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో ఏడాది పాటు కొబ్బరికాయల విక్రయానికి శనివారం ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, జిల్లా దేవాదాయశాఖ తనిఖీదారు శివయ్య సమక్షంలో వేలం నిర్వహించారు. పెండ్లిమర్రి మండలం సోగలపల్లికి చెందిన వెంకటరమణారెడ్డి రూ.80 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం ఖాళీ నెయ్యి డబ్బాలు, ప్లాస్టిక్ సంచులు తదితర వాటి వేలం ద్వారా రూ.1,37,126 ఆదాయం వచ్చిందని వెల్లడించారు. దీంతో ఆలయానికి 81,37,126 ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. ఇడుపులపాయ సీఐ నాగరాజు, ఎస్సై కృష్ణయ్య, మాజీ ఛైర్మన్లు వెంకటస్వామి, రాజారావు, పాల్గొన్నారు.

బాధిత బాలికకు ప్రభుత్వం అండ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : గోపవరం మండలంలో హత్యాయత్నానికి గురైన బాలికకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా పథక సంచాలకులు శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను శనివారం ఆమె పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున బాలికకు న్యాయం చేస్తామన్నారు. బాలికకు మెరుగైన వైద్య సేవలందించేలా సంబంధిత అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీవో సుభాష్, ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి: బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించిన విఘ్నేష్ అనే వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ప్రపంచ మానవహక్కుల అవగాహన సంఘం జాతీయ అధ్యక్షుడు కాసల కోనయ్య డిమాండు చేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై అరాచకాలు పెరిగిపోయాయన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద పోలీసులను ఉంచి ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వజన ఆసుపత్రి : బద్వేలులో ఇంటర్ విద్యార్థినిని కిడ్నాప్ చేసి, పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన ఘటన భయభ్రాంతులకు గురి చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని శనివారం వైకాపా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్తతో కలిసి పరామర్శించారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

బద్వేలు, గోపవరం: గోపవరం మండలంలోని ఓ ప్రాంతంలో హత్య యత్నానికి గురైన విద్యార్థినికి అండగా ఉంటామని తెదేపా నియోజకవర్గ బాధ్యురాలు విజయమ్మ, సమన్వయకర్త రితేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించడంతోపాటు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని తెలిపారు. వీలైనంత త్వరలో నిందితుడికి చట్టపరంగా శిక్షపడేలా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు విజ్ఞప్తి చేసినట్లు వారు వివరించారు.

తెదేపా నగరాధ్యక్షుడిపై దాడి అమానవీయం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : తెదేపా కడప నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు ఎస్పీ హర్షవర్ధన్‌కు వినతిపత్రం అందించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి దాడి జరిగిన తీరును వివరించారు. ఈ సందర్భంగా అమీర్‌బాబు మాట్లాడుతూ శివకొండారెడ్డిని హత్య చేసేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. రాజకీయాల్లో హత్యలు మంచి పద్ధతి కాదన్నారు. తక్షణమే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. అంతకుముందు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న శివకొండారెడ్డిని పరామర్శించారు. ఎస్పీని కలిసిన వారిలో వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసిర్‌అలీ తదితరులున్నారు. ◆ తెదేపా నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.


ఎస్పీ హర్షవర్ధన్‌కు వినతిపత్రం అందిస్తున్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, నాయకులు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

చక్రాయపేట, న్యూస్‌టుడే : గండి వీరాంజనేయస్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి వేంపల్లె మండలం పుల్లయ్యతోటకు చెందిన చెల్లుబోయిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,516 నగదును శనివారం అందజేశారు. నగదును ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ఆలయ మాజీ ఛైర్మన్ వెంకటస్వామి, ఉపప్రధాన అర్చకుడు రాజారమేష్ సమక్షంలో అందజేశారు. దాత కుటుంబానికి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.


ఈవో వెంకటసుబ్బయ్యకు నగదు అందజేస్తున్న దాత శ్రీనివాసులు

వైవీయూ అధ్యాపకులకు అంతర్జాతీయ ప్రాజెక్టులు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : యోగి వేమన విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహించే ఇద్దరు ఆచార్యులకు అమెరికా వాషింగ్టన్‌లోని హెల్త్ సొసైటీ పార్ట్నర్స్ సంస్థ ప్రాజెక్టును మంజూరు చేసింది. వృక్షశాస్త్ర ఆచార్యులు పులి చంద్ర ఓబుల్‌రెడ్డి, బయో టెక్నాలజీ ఆచార్యులు ఆచార్య అఖిల చంద్రశేఖర్ ప్రాజెక్టు పత్రాలను శనివారం వీసీ నుంచి అందుకున్నారు. మొక్కల్లో ఉండే విషపూరిత రసాయనాలను వినియోగించి ప్రజల ఆరోగ్యంపై దెబ్బ తీసే చర్యలకు భవిష్యత్తులో అడ్డుకట్ట వేసేందుకు ఈ ప్రాజెక్టు పనిచేస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాజెక్టు ఫలితాలను అమలు చేయనున్నారు. ఈ సందర్భంగా వీసీ, ప్రిన్సిపల్, అధ్యాపకులు ప్రాజెక్టుదారులకు అభినందనలు తెలిపారు.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభల విజయవంతానికి పిలుపు

కడప విద్య, న్యూస్‌టుడే : హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఈ నెల 24న, విజయవాడలోని ఎంబీవీకే భవనలో నవంబరు 5న పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభలు నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. కడప నగరంలో శనివారం స్వర్ణోత్సవ సభలకు సంబంధించిన గోడపత్రాలను పీడీఎస్‌యూ నాయకులతో కలిసి ప్రైవేట్ విద్యాసంస్థల రాష్ట్ర నాయకుడు ఎస్‌కే వలి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ.. 50 ఏళ్ల విద్యార్థి ఉద్యమాన్ని సమీక్షించి విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో భవిష్యత్తు విద్యారంగ సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. పద్మశ్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మాధవి, నాయకులు మనోజ్, గణేష్, వెంకటరమణ, అరుణ్, మనోహర్, భాస్కర్‌రెడ్డి, అలీబాషా, సుల్తాన్, రాణి తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రాలు ప్రదర్శిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నూనె గింజల సాగు పెంచాలి


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : జిల్లాలో నూనె గింజల పంటలు సాగు పెంచేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరావు సూచించారు. శనివారం మండలంలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన వైయస్ఆర్, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఏడీఏలకు శిక్షణ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు, వాటి దిగుబడి, ప్రస్తుత వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టం, వర్షపాతవ నమోదు వివరాలు తెలుసుకున్నారు. రబీలో వేసుకోవాల్సిన పంటలు, వాటి రకాల గురించి కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం సమన్వయకర్తలు వీరయ్య, అంకయ్యకుమార్, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, శ్రీవల్లి, మాధురి, భాగవతప్రియ వివరించారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా డీఏవో చంద్రనాయక్, ఏడీఏలు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: వంట ఏజెన్సీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో శనివారం రీజియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే మొత్తాలను పెంచాలని కోరారు. నాయకులు చంద్రహాస్‌రెడ్డి, వాకా చంద్రశేఖర్, బాలరాజు, సుబ్బారెడ్డి, వెంకటరామయ్య పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

మాదకద్రవ్యాలతో జీవితాలు బుగ్గి

మైదుకూరు, న్యూస్‌టుడే : మాదకద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో నెహ్రూ యువజన కేంద్రం, వీరబ్రహ్మేంద్రస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువతే దేశానికి వెన్నెముక అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.సుభాన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ పి.నారాయణరెడ్డి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు: 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ: 8008573493

స్పందనకు వందనం

● **ప్రొద్దుటూరు పట్టణం:** స్థానిక శ్రీరాములపేట యూహెచ్‌సీ వీధిలో కాలువల్లోని పూడికను 12వ సచివాలయ వార్డు పారిశుద్ధ్య కార్యదర్శి గురుశేఖర్‌యాదవ్ కార్మికులతో పూడికను తీయించారు.

● **ప్రొద్దుటూరు పట్టణం :** టీబీరోడ్డులో కోర్టుకు సమీపంలోని కాలువల్లో పూడిక పనులను 4వ వార్డు సచివాలయ పంచాయతీ పారిశుద్ధ్య కార్యదర్శి శివకరుణశ్రీ కార్మికులతో పూడిక పనులు చేయించారు.

● **ప్రొద్దుటూరు పట్టణం:** ఆదాయపుపన్ను శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న సెంట్రల్ లైటింగ్ వీధిదీపాలు వెలుగుతున్నాయి. రెండు రోజుల కిందట వీధిదీపాలు వెలగకపోవడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు.

?: ప్రొద్దుటూరు పట్టణం బాకరాపేట.వీధిలో కాలువల్లో సకాలంలో మురుగు తొలగించడం లేదు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **-విజయ, స్థానికురాలు**

✓: కాలువల్లో పూడికను తొలగిస్తున్నాం. పరిశీలించి పూడిక తొలగింపునకు చర్యలు తీసుకుంటాను.
-నూర్‌బాషా, ఒకటో పారిశుద్ధ్య అధికారి, ప్రొద్దుటూరు

?: ప్రొద్దుటూరు పట్టణం గాంధీరోడ్డు పోసినా కాంపౌండ్ ఎదురుగా ఉన్న సెంట్రల్ లైటింగ్ వీధిదీపాలు వెలగడం లేదు. **-బాలయ్య, స్థానికుడు**

✓: వీధిదీపాలు వెలిగేందుకు చర్యలు తీసుకుంటాను.

?: ప్రొద్దుటూరు పట్టణం బురుసాదుమఠంవీధిలో కొన్ని వీధుల్లో అర్ధరాత్రి వేళ తాగునీరు సరఫరా అవుతోంది. తాగునీరు పట్టుకోవడం కష్టంగా ఉంది. సాధారణ వేళలో నీటి పంపిణీకి చర్యలు తీసుకోవాలి. **- రామకృష్ణ, స్థానికుడు**

✓: అర్ధరాత్రి వేళ తాగునీటి పంపిణీ కాకుండా సాధారణ వేళలో పంపిణీ అయ్యేందుకు చర్యలు తీసుకుంటాను.
-వి.మల్లికార్జున, కమిషనర్ ప్రొద్దుటూరు పురపాలక సంఘం

సమస్యలనేకం...చూపరా పరిష్కారం?

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు

జమ్మలమడుగు పట్టణం వేగంగా విస్తరిస్తున్నా... అందుకు తగ్గట్టు అభివృద్ధి జరగడం లేదు. కొన్ని వార్డుల్లో సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. సుమారు 19 ఏళ్ల కిందట జమ్మలమడుగు నగర పంచాయతీగా అవతరించింది. అప్పుడు వేసిన పైపు లైన్లు అలాగే ఉన్నాయి. కాలువలు చిన్నవిగా ఉన్నందున మురుగు వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఇంకా కొన్ని వార్డుల్లో సిమెంటు రోడ్లు వేయాల్సి ఉంది. ఒకటి నుంచి పదో వార్డులను పరిశీలిస్తే పలు రకాల సమస్యలు పలకరిస్తున్నాయి.

● ఒకటి, రెండు వార్డుల్లోని భాగ్యనగర్, వేంకటేశ్వర కాలనీల్లో సిమెంటు రోడ్లు ఉన్నాయే తప్ప కాలువలు లేవు. రామిరెడ్డితోట ప్రాంతంలో కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మూడు, నాలుగు వార్డుల్లోని లక్ష్మీనగర్, రామిరెడ్డిపల్లె రోడ్డు, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య వేధిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాల్గో వార్డులోని శ్రీరామ్ నగర్ వీధిలో కాలువలేక మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. కనీసం అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడింది. అయిదో వార్డులో చౌడేశ్వరి ఆలయ వీధికి సరైన రహదారి లేదు. అస్తవ్యస్తంగా మారడంతో భక్తులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఆరో వార్డులో నాగుల కట్ట, బండారు వీధి, చౌడేశ్వరిదేవి ఆలయం తదితర ప్రాంతాలు ఉన్నాయి. నాగులకట్ట వీధిలో ప్రతి వీధికి సిమెంటు రహదారులు, కాలువలున్నా కొన్నిచోట్ల అధ్వానంగా మారాయి. ఏడో వార్డులో మేదరవీధి, దుత్తలూరు నగర్, ఎస్సీ కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలు ఉన్నాయి. కొన్ని వీధులు మరీ ఇరుకుగా మారాయని అత్యవసర వేళల్లో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. రాత్రైతే దోమలు విజృంభిస్తున్నాయని చెబుతున్నారు. ఎనిమిదో వార్డులోని బీసీ, ఎస్సీ, శబరి కాలనీల్లో కాలువలు దుస్థితికి చేరాయి. 9, 10 వార్డుల్లో కన్నెలూరు, నేతాజీనగర్ ప్రాంతాలు ఉన్నాయి. గొరిగనూరురోడ్డులో కాలువలు పూర్తిస్థాయిలో లేవు. నేతాజీ నగర్‌లో వానా కాలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చిన్న కాలువలు ఉన్నందున డ్రైనేజీ పొంగి రహదారిపై నిలుస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.



శ్రీరామ్‌నగర్‌లో వీధిలోనే మురుగు ప్రవాహం



వెంకటేశ్వరకాలనీలో కాలువల్లేక అధ్వాన రోడ్డు

వీధి దీపాలు తక్కువగా ఉన్నాయి



ఎస్సీ కాలనీలో కొన్ని చోట్ల వీధి లైట్లు తక్కువగా ఉన్నందున రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. దోమలు సైతం ఎక్కువగా ఉన్నాయి. దోమల నివారణ మందు పిచికారీ చేసి సమస్యను పరిష్కరించాలి.
-మేకల ఓబులమ్మ, ఎస్సీ కాలనీ, ఏడో వార్డు, జమ్మలమడుగు నగర పంచాయతీ

వాన నీరు నిలబడుతోంది



ఆరో వార్డులోని దయానంద స్కూల్ వీధిలో రహదారిపై నీళ్లు నిలబడుతున్నాయి. కాలువలు ఎత్తు ఉండి రోడ్డు తక్కువ ఎత్తులో ఉన్నందున ఈ సమస్య వేధిస్తోంది. రైల్వే స్టేషన్ వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేస్తే రాకపోకలకు అనువుగా ఉంటుంది.
-ఆదినారాయణరెడ్డి, ఆరో వార్డు, జమ్మలమడుగు నగర పంచాయతీ

పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నాం

అన్ని వార్డులను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నాం. ఉదయం పూట రహదారుల పరిశుభ్రత, మధ్యాహ్నం కాలువల్లో పూడిక తొలగించే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఇంటింటి చెత్త సేకరణ మరింత మెరుగు కోసం 20 తోపుడు బండ్లను తెప్పిస్తున్నాం. వీధి లైట్ల సమస్యను సైతం రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తాం. **-వెంకటరామిరెడ్డి, కమిషనర్, జమ్మలమడుగు నగర పంచాయతీ**

సమన్వయలోపం... ప్రాణాలతో చెలగాటం

మలుపు వద్ద తొలగని లీకేజీతో ప్రమాద ఘంటికలు



దొరసానిపల్లె బైపాసురోడ్డు మలుపు వద్ద పాచిపట్టిన లీకేజీ మడుగులో ఏపుగా పెరిగిన జమ్ము

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

ఓబుళాపురం - కృష్ణపట్నం, అంతర్ జిల్లాలతోపాటు తెలంగాణ జిల్లాలకు అనుసంధానంగా ఉన్న ఈ మార్గంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. 67వ జాతీయ రహదారిలో ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రొద్దుటూరు దొరసానిపల్లె బైపాసు రోడ్డులోని మలుపు వద్ద లీకేజీ సమస్యతో గత ఏడు నెలలకుపైగా తాగునీటి గొట్టాల నుంచి వృథాగా పోతున్న రక్షిత నీటి మడుగు పక్కన ఏపుగా విస్తరిస్తున్న జమ్ము పొదలు, గడ్డి.. పాదచారులు, చోదకులకు ప్రమాదకర పరిస్థితులు ఉన్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. రోజువారీగా ఈ మార్గం మీదుగా పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దొరసానిపల్లె బైపాసు మలుపు వద్ద ప్రొద్దుటూరు మండలంలోని చౌటపల్లె, గోపవరం పంచాయతీలతోపాటు రాజుపాళెం మండలంలోని చిన్నశెట్టిపల్లె, కొర్రపాడు పంచాయతీలకు రక్షిత తాగునీటి పథకాలకు సంబంధించి పలు రకాల గొట్టాలను ఏర్పాటు చేశారు. బొల్లవరం జగనన్న కాలనీలోని కట్టడాలకు నీటి సరఫరా కోసం డక్టన్ పైపు ఇదే మార్గంలో ఉంది. చౌటపల్లె నుంచి దొరసానిపల్లె రహదారి మీదుగా రాకపోకల దృష్ట్యా మలుపు వద్ద ముందస్తుగా వాహనాల రాకపోకలను గుర్తించలేని విధంగా ముప్పు పొంచి ఉంది. అప్రమత్తం లేకపోతే రోడ్డు ప్రమాదాలకు దారితీసే పరిస్థితులు ఉన్నాయి. సుమారు 8 తాగునీటి గొట్టాలు ఉన్నందున దేని నుంచి లీకేజీ వస్తుందో సమస్య గుర్తించకుండా మమ అనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ అధికారులు, ఇంజినీర్లు మధ్య సమన్వయం లేక దొరసానిపల్లె బైపాసు మలుపు వద్ద ప్రమాద స్థితిలో ఉన్న పాచిపట్టిన మడుగు, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు దృష్ట్యా వాహనదారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పంచాయతీ తాగునీటి పథకాలకు సంబంధించి పైపులకు లీకేజీ గుర్తించడంలో సంక్లిష్టంగా ఉందన్నారు.

సర్విరెడ్డిపల్లెలో రీసర్వే గ్రామ సభ

ప్రొద్దుటూరు గ్రామీణ, చాపాడు : ప్రొద్దుటూరులోని సర్విరెడ్డిపల్లెలో చేపట్టిన రీసర్వేలో భాగంగా భూవివాదాలకు సంబంధించి బాధిత రైతుల కోసం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించినట్లు జిల్లా సర్వేయరు ఇన్‌స్పెక్టర్లు పుల్లయ్య, వెంకటేశ్వర్లు తెలిపారు. 659 ఎకరాల పరిధిలో రీసర్వే చేపట్టినట్లు డీటీ సుదర్శన్ తెలిపారు. దీంతో పది మంది రైతులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు అందజేసినట్లు చెప్పారు. సర్వేయరు వెంకట లక్ష్మి, కొత్తపల్లె సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వీఆర్వో సాయి ప్రకాశ్, సర్వేయర్లు రాఘవరెడ్డి, సాయి సుమ, సిబ్బంది పాల్గొన్నారు. చాపాడులోని భద్రిపల్లెలో 28 వినతులు వచ్చాయని రీసర్వే డీటీ బాలనారాయణస్వామి తెలిపారు. విజయవాడ-బెంగళూరు, హుబ్లీ-కృష్ణపట్నం హైవేల రహదారుల్లో భూములు కోల్పోయిన కొందరు రైతులు తమకు పరిహారం అందలేదని సదస్సులో ప్రస్తావించారు.

రవికల్యాణ్‌కు సత్కారం

మైదుకూరు, న్యూస్‌టుడే: స్థానిక గొల్లపల్లెకు చెందిన భూమిరెడ్డి రవికల్యాణ్‌కు ముంబయిలోని శ్రీ సై కిశోర్ ఫౌండేషన్ నిర్వాహకులు శుక్రవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ రాష్ట్ర రత్న అవార్డుతో సత్కరించారు. సంస్థ డైరెక్టర్ చంద్రకాంత సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రవికల్యాణ్ అందుకున్నారు. అధ్యాపక వృత్తితోపాటు సమాజ సేవ, ఎన్ఎస్ఎస్ ద్వారా చేస్తున్న సేవలను గుర్తించిన నిర్వాహకులు అవార్డుతో సత్కరించారు.

విద్యార్థుల ప్రతిభకు పట్టం

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులోని బ్రిలియంట్ పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్‌నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలు నిలిచిన విద్యార్థులు షేక్.హుస్సేన్, షేక్.హర్షవర్ధన్, షేక్.సుహానాకు పాఠశాల కరస్పాండెంట్ ఎం.పవన్‌కుమార్‌రెడ్డి బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ ఎం.నాగశ్రావణి పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం



వ్యాసం రాస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కరస్పాండెంట్ ఎం.పవన్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగశ్రావణి

సృజనకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులోని విద్యావికాస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్‌నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు టి.రవికుమార్, ఎస్.అఫీఫా, ఎస్.తౌఫీకకు విద్యావికాస్ పాఠశాల కర స్పాండెంట్ ఎస్.రాజయాదవ్ బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ ఎస్.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు




విద్యార్థులకు బహుమతులు, అందజేస్తున్న కరస్పాండెంట్ రాజా యాదవ్, ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న

వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు పద్మశ్రీ, గాయత్రి

బ్రహ్మంగారిమఠం, కాశినాయన, మైలవరం, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో విద్యార్థిని, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి అన్నారు. బ్రహ్మంగారిమఠం, కాశినాయన, మైలవరం మండలాల్లోని బాల, బాలికల వసతిగృహాలు, అనాథ శరణాలయాలను శనివారం వారు పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, ఇతర సదుపాయాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ సంక్షేమాధికారులతో మాట్లాడారు. నరసాపురంలోని బీసీ బాలికల వసతి గృహం, ఎస్సీ బాలుర వసతిగృహం, వివేకానంద సేవాశ్రమాన్ని హైకోర్టు ఆదేశాల మేరకు పరిశీలించారు. బాలికల వసతి గృహంలో స్లాబుకు చెమ్మరావడం, బాలుర వసతి గృహంలో విద్యార్థులకు సరిపడా స్థలం లేకపోవడం వంటి సమస్యలు గుర్తించారు. మైలవరంలోని రాజా ఫౌండేషన్ (డాడీహోం)లోని అనాథ పిల్లలు, వృద్ధులతో జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి మాట్లాడారు. అనంతరం బీసీ మహిళ వసతి గృహాన్ని పరిశీలించారు. ఎస్.ఐ శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు పండ్లను అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి భార్గవి

పారనిమురుగు... ప్రజలకు తీరని అవస్థలు

-న్యూస్‌టుడే, ఎర్రగుంట్ల

పారిశ్రామికవాడగా గుర్తింపు పొందిన ఎర్రగుంట్ల పట్టణంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా మురుగు నీరే దర్శనమిస్తోంది. గతంలో పట్టణంలోని వార్డుల్లో కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడపడితే అక్కడ నీరు నిలుస్తోంది. రహదారులు జలపాతాలను తలపిస్తోంది. ఇళ్లలోకి కూడా వర్షపు నీరు చేరుతోంది. మొత్తం ఎర్రగుంట్ల నగర పంచాయతీలో 54 కి.మీ మేర డ్రైనేజీ కాలువలు అవసరం కాగా ప్రస్తుతం కేవలం 11.6 కి.మీ మాత్రమే ఉన్నాయి. కాలువల్లేక రహదారులు అధ్వానంగా మారాయి. ప్రధానంగా శాంతినగర్, సుందరయ్యనగర్, రాణీవనం, సున్నపుబట్టీలవీధి, వేంపల్లె రోడ్డు, కడపరోడ్డు, తదితర ప్రాంతాల్లో నీరు ఎక్కువగా నిలుస్తోంది. మరికొన్ని చోట్ల రహదారులు లేకపోవడంతో గుంతల్లో వర్షపునీరు నిలబడి రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



గుంతలతో అధ్వానంగా శాంతినగర్ రోడ్డు

వసతుల కల్పనలో విఫలం...

గ్రామ స్థాయి నుంచి నగర పంచాయతీగా మార్పు చెంది సుమారు 13 ఏళ్లు అవుతున్నప్పటికీ ప్రజలకు వసతులు ఏర్పరచడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. 20 వార్డుల్లో దాదాపు 8,600 నివాసాలు ఉండగా వాటిలో సుమారు 32,572 మంది జనాభా నివసిస్తున్నారు. గతంలో వార్డుల్లో కేవలం రోడ్లు మాత్రమే నిర్మించారు. కాలువల నిర్మాణం చేపట్టలేదు. మురుగునీటి వల్ల దోమలు వ్యాప్తి చెంది ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

ప్రగతి నివేదిక తయారు చేస్తున్నాం

పట్టణంలో చాలా వరకు డ్రైనేజీ నిర్మాణం జరుగలేదు. దీంతో వర్షపు నీరు రోడ్లపైన నిలుస్తోంది. సుందరయ్యనగర్‌లో నీరు ఇళ్లలోకి చేరుతుంటే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని తొలగించాం. పట్టణంలో మొత్తం డ్రైనేజీ నిర్మాణానికి ప్రగతి నివేదిక (డీపీఆర్) తయారు చేస్తున్నాం. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డితో చర్చించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.
-శేషఫణి, కమిషనర్ ఎర్రగుంట్ల నగర పంచాయతీ

పూరి గుడిసె దగ్ధం

అట్లూరు, న్యూస్‌టుడే : అట్లూరు క్రాస్‌రోడ్డులోని మద్దూరు కాలనీలో శనివారం రాత్రి అట్లూరు ఓబులమ్మకు చెందిన పూరిగుడిసె అగ్ని ప్రమాదానికి దగ్ధమైంది. కట్టెలకు మంటలు అంటుకుని పూరి గుడిసెకు మంటలు అంటుకున్నాయి. స్థానికులు మంటలను నీటితో అదుపుచేశారు.

దాడి ఘటనలో అరెస్టు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: బద్వేలు క్రాస్ రోడ్డులో ఫిబ్రవరి 18న దాడి ఘటన కేసులో నిందితుడు చాటకొండు.గురయ్యను శనివారం అరెస్టు చేశామని ఎస్సై కొండారెడ్డి తెలిపారు. చిన్నయరసాలకు చెందిన సూరే రవి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప రాడ్లతో దాడి చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు.

వృద్ధురాలికి గాయాలు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు కోనేటి కాల్వవీధిలోని ఓ ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించి వృద్ధురాలు కంచర్ల జయమ్మకు గాయాలయ్యాయి. జయమ్మ పులిహోర వండి అమ్ముకుని జీవనం సాగించేవారు. ఈ క్రమంలోనే పులిహోర వండేందుకు అన్ని సిద్ధం చేసుకుని గ్యాస్ పొయ్యి అంటించారు. అంతకు ముందే లీకైన గ్యాస్ ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మండింది. దీంతో ఆమెకు గాయాలయ్యాయి.

ఉచిత కంటి వైద్య శిబిరం నేడు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: వాసవి కాటన్ మర్చంట్స్ కల్యాణ మండపంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు లయన్స్ మాజీ గవర్నర్ జొన్నలగడ్డ చంద్రప్రకాష్‌రావు తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణం వాసవీ కాటన్ మర్చంట్స్ కల్యాణ మండపం, వాసవి సేవా సమితి, సాయిసేవా సంఘం, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి మధురై తిరుపతి శాఖ సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.

పల్లె పండగలో అభివృద్ధికే ప్రాధాన్యం

కలసపాడు, అట్లూరు, ప్రొద్దుటూరు గ్రామీణ, రాజుపాళెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లెపండగలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి తెలిపారు. శనివారం కలసపాడు మండలంలోని ఎగువతంబళ్లపల్లె, ఎగువరామాపురంలో పల్లెపండగ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భాజపా నాయకుడు బొజ్జా రోశన్న, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు రంతూలతో కలిసి రూ. 27 లక్షలతో అయిదు సిమెంటు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అట్లూరు, వరికుంట, రెడ్డిపల్లెలో రూ.44 లక్షలు 9 సిమెంటు రహదారుల పనులకు ఎంపీపీ రమాదేవిభూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నాయకులు మల్లికార్జునరెడ్డి, జయకృష్ణ, రెడ్డయ్య, పాల్గొన్నారు. ప్రొద్దుటూరు కొత్తపల్లె పంచాయతీలోని గణేష్ నగర్‌లో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు ఏర్పాటు పనులను సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రారంభించారు. ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, పీఆర్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. రాజుపాళెం మండలంలోని కొర్రపాడులోని ఎస్సీ కాలనీలో రూ.30 లక్షలతో సిమెంటు రోడ్లకు సర్పంచి శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీవో వెంకటరమణారెడ్డి, కార్యదర్శి రామాంజనమ్మ, ఇంజినీర్ నరేన్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు.



కలసపాడులో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌రెడ్డి తదితరులు

రెండో మద్యం దుకాణం ప్రారంభం తాత్కాలిక వాయిదా

ముద్దనూరు : పట్టణంలో శనివారం సాయంత్రం పోలీసులు డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. శుక్రవారం మద్యం దుకాణం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన వివాదం దృష్ట్యా రెండో మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్న సందర్భంగా ప్రజల్లో శాంతి భద్రతలపై భరోసా కల్పించేందుకు కవాతు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే రెండో మద్యం దుకాణం ప్రారంభం తాత్కాలికంగా వాయిదా పడింది. ఈ కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు బాగు చేయాలని నిరసన

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని వార్డుల్లో రోడ్లు దారుణంగా మారాయని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని ఆధ్వర్యంలో శనివారం స్థానిక త్యాగరాజుకాలనీలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ చాలా వార్డుల్లో రోడ్లు వేయలేదన్నారు.

3 రోజులుగా తాగునీటి సమస్య

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక బాకరాపేటవీధిలో మూడు రోజుల నుంచి పురపాలక సంఘం పంపిణీ చేసే తాగునీరు మూడు రోజుల నుంచి సక్రమంగా రావడం లేదని ఆప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లవారుజామున నీటిని పంపిణీ అవుతుండగా కొద్ది సేపటికే ఆగిపోవడం వలన నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

మద్యం, ఇసుకపై బహిరంగ చర్చకు రావాలి

చాపాడు, న్యూస్‌టుడే: దశలవారీగా మద్యనిషేధమని చెప్పి 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ వేల కోట్లు దోచుకున్నారని, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడారని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం అమలు చేసే నూతన మద్యం విధానం, ఉచిత ఇసుకపై వైకాపా నాయకులు బహిరంగ చర్చకు రావాలన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

-న్యూస్‌టుడే, బద్వేలు, అట్లూరు, గోపవరం

వైకాపా పాలనలో గ్రామ పంచాయతీలను పట్టించుకోలేదు. నిధులను పక్కకు మళ్లించి అభివృద్ధిని విస్మరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసే విధంగా చర్యలు చేపట్టింది. బద్వేలు నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు, మెటల్ రోడ్లను వేసేందుకు 213 పనులను రూపకల్పన చేశారు. ఇందుకోసం రూ. 14,06 కోట్ల ఎన్‌ఆర్‌జీఎస్ నిధులను వెచ్చిస్తున్నారు. ఈ పనుల్లో ఇప్పటికే అట్లూరు మండల కేంద్రం, సోమేశ్వరంలో సిమెంటు రోడ్ల పనులను మొదలు పెట్టారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా పనులను ప్రజాప్రతిధుల ద్వారా ఇంజినీరింగ్ అధికారులు పనులను ప్రారంభిస్తున్నారు. ఎక్కువ శాతం గ్రామాల్లో సీసీ రోడ్లు, మెటల్ రోడ్లను వేసేవిధంగా పనులను రూపకల్పన చేశారు. ఈ పనులన్నీ జనవరి నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లు పీఆర్ డీఈఈ సూర్యనారాయణరెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలియజేశారు.

నియోజకవర్గ వివరాలు

మండలం	పనులు	రూ. కోట్లలో
అట్లూరు	35	2.26
బి.కోడూరు	23	1.82
బద్వేలు	36	2.17
గోపవరం	32	1.26
కలసపాడు	30	1.80
పోరుమామిళ్ల	37	2.98
కాశినాయన	30	1.75



అట్లూరు మండలం చిన్న కామసముద్రంలో రోడ్డు



గోపవరం మండలం బెడుసుపల్లె రోడ్డు

స్వర్ణోత్సవ మహాసభల విజయవంతానికి పిలుపు

వేంపల్లె, న్యూస్‌టుడే : యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగే స్వర్ణోత్సవ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను శనివారం పాములూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూటీఎఫ్ ఆవిర్భవించి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ మహాసభలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యారంగ పరిరక్షణకు భవిష్యత్తులో పోరాటాలు చేసేందుకు మహాసభలను వేదికగా చేసుకుంటున్నామని తెలిపారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

బ్రౌన్ శాస్త్రి కీర్తి అజరామరం



హనుమచ్ఛాస్త్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పర్యాటక సంస్థ ప్రతినిధులు

ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే : బ్రౌన్ గ్రంథాలయం పేరు వినిపించగానే డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి గుర్తుకొస్తారని, ఆయన వ్యక్తిత్వం ఎందరికో స్ఫూర్తినిచ్చిందని రాయలసీమ పర్యాటక సంస్థ ప్రెసిడెంట్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. జానమద్ది శత జయంతి సందర్భంగా రాయలసీమ టూరిజం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రౌన్ తెలుగుపై చూపిన మక్కువ అందరికీ స్ఫూర్తినిచ్చిందన్నారు. విశ్రాంత హెచ్ఎం కె.బాలయల్లారెడ్డి, సంస్థ కార్యదర్శి కొండూరు జనార్దనరాజు, కోటేశ్వరరావు, జ్యోతిజార్జి, విజయ్, డేవిడ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

మారుతీనగర్, న్యూస్‌టుడే : యర్రముక్కపల్లెలోని సమస్యలపై నగరపాలక అధికారులు స్పందించారు. అధ్వాన పారిశుద్ధ్యంతో అవస్థలు అనే శీర్షికతో ఈనాడులో శుక్రవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించి పందుల సంచారంపై, శనేశ్వరస్వామి ఆలయం పరిసరప్రాంతాల్లో ముళ్లపొదలపై నగరపాలక ప్రత్యేక అధికార బృందం పరిశీలించి స్థల యజమానులకు, పందుల సంచారంపై నోటీసులు జారీ చేశారు. త్వరలో అన్నింటినీ తొలగించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఆయా ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు.

తొండూరు, న్యూస్‌టుడే : తొండూరు మండలంలోని బూచుపల్లెలో రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండటంపై మేమున్నాం మీకుతోడుగాలో సమస్య ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు యంత్రం సాయంతో మురుగును తొలగించారు. - **న్యూస్‌టుడే, తొండూరు**

?: ముద్దనూరు- పులివెందుల ప్రధాన రహదారిపై తీసిన గుంతతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - **ఎన్ భాస్కర్‌రెడ్డి, వాహనదారుడు**

✓: రహదారిపై ఉన్న గుంతను పూడ్చిస్తాం. - విశ్వనాథ రెడ్డి, ఏఈఈ పులివెందుల

?: మండల పరిధిలో చిన్నపాటి వర్షానికే నీరు నిలుస్తోంది. బురదలో ప్రయాణిస్తూ ఇబ్బందిపడుతున్నాం.- **కుల్లాయప్ప**

✓: నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - **నాగభూషణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

ప్రధాన కూడళ్లు... కనిపించని సూచికలు

కడప శంకరాపురం, నగరపాలక న్యూస్‌టుడే : కడప నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు, వేగ నియంత్రికలు లేకపోవడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారినపడుతున్నారు. అన్నమయ్య కూడలి - అప్సరా థియేటర్ కూడలి మధ్య రహదారి ప్రమాదకరంగా మారింది. 100 అడుగుల వెడల్పున్న ఈ ప్రధాన రహదారి మీదుగా ద్విచక్రవాహనాలు, ఆటోలు, బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంత కీలకమైన మార్గంలో ఎక్కడా ట్రాఫిక్ సిగ్నల్ దీపాలు ఏర్పాటు చేయలేదు. ప్రమాదకరమైన ప్రాంతాల్లో వేగ నియంత్రికలు, సూచికలు ఏర్పాటు చేయలేదు. ఎస్పీ బంగళా రోడ్డును మద్రాసు రోడ్డుతో కలిపే కూడలి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ కూడలిలో సిగ్నల్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అప్సరా కూడలిలో ఏ వాహనం ఎటువైపు నుంచి వస్తుందో తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అన్నమయ్య కూడలి నుంచి అప్సరా థియేటర్ మధ్య మున్సిపల్ ప్రధాన పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాల, నగరపాలక సంస్థ క్రీడా ప్రాంగణం, సమీకృత బాలికల వసతి గృహం, బాలుర బీసీ వసతి గృహం, అంధుల పాఠశాల ప్రధాన రహదారి పక్కనే ఉన్నాయి. ఏ ఒక్క పాఠశాల వద్ద నిబంధనల ప్రకారం సూచిక గుర్తులు ఏర్పాటు చేయలేదు. ఈ మార్గంలో వాహనాలు వేగంగా వెళుతుండటంతో స్థానికులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాల బారినపడుతున్నారు. అవసరమైన చోట తగిన ప్రమాణాలతో వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రహదారులు, భవనాల శాఖ, నగరపాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో చర్యలు తీసుకుంటే ఈ మార్గం కడప నగర రహదారులకు నమూనా రహదారిగా మారుతుంది.



ప్రమాదకరంగా అప్సరా కూడలి

పరిసరాలు ఇలా... పరిశుభ్రత ఎలా?

లింగాల, న్యూస్‌టుడే : పులివెందుల మార్కెట్‌యార్డు పరిధిలో పరిశుభ్రత చర్యలు తీసుకోకపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. మార్కెట్ యార్డు నిర్మాణ పనులు 2022 ఏప్రిల్ 16న పూర్తి కాగా 2023 అక్టోబరులో అందుబాటులోకి వచ్చింది. మార్కెట్‌యార్డులో ప్రధానమైన జంబోషెడ్డులో చీనీ ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరుగుతాయి. నాణ్యత లేని చీనీకాయలు కుప్పలుగా షెడ్డు చుట్టూ పడేస్తుండటంతో ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో అవి కుళ్లిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. షెడ్డుకు మరోవైపు చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోయింది. చెత్త తొలగించకపోవడంతో దోమలు వ్యాపిస్తున్నాయి. ఇప్పటికే పట్టణవాసులు డెంగీ, టైఫాయిడ్‌తో ఆసుపత్రుల చుట్టూ పరుగులు తీస్తున్నారు. మార్కెట్‌యార్డు సముదాయంలో అగ్రిల్యాబ్, రైతు బజార్, క్యాంటీన్ ఉన్నాయి. అధికారులు, రైతులు, వినియోగదారులు, వ్యాపారులు నిత్యం ఈ ప్రాంతానికి వస్తుంటారు. మార్కెట్ రుసుం రూ.లక్షల్లో వస్తున్నా పరిశుభ్రతకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదని వ్యాపారులు, రైతులు వాపోతున్నారు. పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటామని మార్కెట్‌యార్డు సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.



యార్డులో కుళ్లిపోయిన చీనీకాయలు

ప్రతిభకు పట్టం



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలతో ప్రిన్సిపల్ సావిత్రి, ఉపాధ్యాయురాలు లీనా

కడప నగరం శంకరాపురంలోని శ్రీ శాంతినికేతన్ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో శనివారం ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఎస్.నజీబా (9వ తరగతి), ఎస్. మెహక్ ఫాతిమా (10వ తరగతి), జె.హారిక (9వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రిన్సిపల్ సావిత్రి, ఉపాధ్యాయురాలు లీనా విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎలియాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. **- న్యూస్‌టుడే, కడప విద్య**

నైపుణ్యాల వెలికితీత

ఈనాడు ఆధ్వర్యంలో కడప నగరంలోని గురుకుల్ విద్యాపీఠ్‌లో శనివారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో ఎం.ఎస్.ముస్రత్ (10వ తరగతి), కె.సాయిసింధు (9వ తరగతి), ఎస్.వీ.ఎన్.ఎస్.గాయత్రి (9వ తరగతి) విజేతలుగా నిలిచారు. సీఈవో వివేకానంద, ప్రిన్సిపల్ మునిచంద్ర, ఇంజినీర్ వెంకటేశ్వర్లు విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. **- న్యూస్‌టుడే, కడప విద్య**



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్న పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

జమిలి ఎన్నికలు ఆచరణ అసాధ్యం

కడప, చిన్న చౌకు, న్యూస్‌టుడే : జమిలి ఎన్నికలు అనవసరమని, ఆచరణ సాధ్యం కాదని రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి పేర్కొన్నారు. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో బ్యాలెట్ కాగితం వాడుతున్నారన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ జాతీయ ఉద్యమ నాయకుడు సంగటి మనోహర్ ఆధ్వర్యంలో 'అక్రమాలు-ఈవీఎంలు-జమిలి ఎన్నికలు' అనే అంశంపై శనివారం ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ.. జమిలి ఎన్నికలు నిర్వహణ సాధ్యం కాదన్నారు. ఎన్నికల ఖర్చు తగ్గించేందుకు జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొనడం విడ్డూరమన్నారు. అఖిలపక్ష పార్టీ నాయకులు అవ్వారు మల్లికార్జున్, చంద్రశేఖర్, రవిశంకర్ రెడ్డి, షేక్ అమీర్, సలావుద్దీన్, అఫ్జల్‌ఖాన్, శ్రీనివాసులు, అబ్దుల్ సత్తార్, శాంతయ్య, పాలగిరి రసూల్, సుబ్బరామయ్య, నాగరత్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి, పక్కన నాయకులు

సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

మారుతీనగర్, న్యూస్‌టుడే : సనాతన ధర్మాన్ని పాటిస్తే మనల్ని భగవంతుడికి దగ్గర చేస్తుందని హిందూ ధార్మిక ప్రచారవేత్త రాధా మనోహర్‌దాస్ పేర్కొన్నారు. స్థానిక కోఆపరేటివ్ కాలనీలోని కోదండ రామాలయంలో శనివారం సనాతన ధర్మంపై నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రవచించారు. ధర్మాలను తప్పకుండా ఆచరించినప్పుడే మనం భగవంతుడిని చేరుకోవచ్చని పేర్కొన్నారు.



ప్రసంగిస్తున్న రాధా మనోహర్‌దాస్

తీగల చోరీ కేసులో నలుగురి అరెస్టు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప రిమ్స్ ఠాణా పరిధిలో నలుగురు దొంగలను అరెస్టు చేసి 150 కిలోల రాగి తీగలు, 50 కిలోల సిల్వర్ తీగలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన వెంకటేష్, కడప నిరంజన్‌నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, ఖాజాహుస్సేన్ విద్యుత్తు తీగలకు సంబంధించి రాగి, సిల్వరు తీగలు చోరీ చేసి విక్రయించేవారు. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసుకునేవారు. శనివారం ఈ నలుగురిని రిమ్స్ రోడ్డులోని రైల్వే ట్రాక్ వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రీసర్వేలో తప్పులు సరిచేస్తాం

కమలాపురం, న్యూస్‌టుడే : రైతుల భూములకు సంబంధించి రీసర్వేలో వచ్చిన తప్పులను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శివరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం గంగవరం, విభరాపురం గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ భూములను సబ్ డివిజన్ చేసి ఇవ్వాలని ఎక్కువ మంది రైతులు అర్జీలు అందించారు. మొత్తం 60 వరకు అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆర్డీవో కార్యాలయ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, రీసర్వే డీటీ శ్రీకాంత్, మండల సర్వేయర్ సురేంద్రనాథ్‌రెడ్డి, సచివాలయాల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : మండల పరిధి ఎనుగువారిపల్లెకు చెందిన రైతు చెండ్రాయుడు అప్పుల బాధతో ఈ ఏడాది మార్చిలో ఆత్మహత్య చేసుకున్నారు. శనివారం కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కడప డివిజన్ బాధ్య ఏడీఏ సురేష్‌కుమార్‌రెడ్డి, గ్రామీణ సీఐ చల్లని దొర మృతుడి కుటుంబ సభ్యులను విచారించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, ఆత్మహత్యకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు అనురాధ, మండల ఏవో పెద్ద ఓబులేసు, ఏఈవో గంగాధర్‌రెడ్డి, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

పాపఘ్ని నుంచి ఇసుక అక్రమ రవాణా

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లెలోని పాపఘ్ని నది నుంచి శనివారం అక్రమార్కులు పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలించారు. వేంపల్లెలో ఇసుకరీచ్ లేకపోయినా అక్రమార్కులు స్థానిక కాపువీధి, గవిమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న పాపఘ్నినది నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలించారు. ఈ విషయమై పోలీసు, రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

కమలాపురం, న్యూస్‌టుడే : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మురుగు కాలువల్లోని వ్యర్థాలను పరిశీలించారు. అనారోగ్య పరిస్థితి ఎదురైతే సంబంధిత సచివాలయ సిబ్బందికి సమాచారమివ్వాలని, వెంటనే ఏఎన్ఎంలు ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే : ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి మనోరమ పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని నగరిగుట్టలో శనివారం సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమకాటుతో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పులివెందుల ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి ఖాజా మొద్దీన్, వైద్యాధికారులు ప్రత్యూష, శాంతకుమార్, సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాష అమలుకు వినతి

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో అంతర్గత పరిపాలన వ్యవహారాలతో పాటు విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో తెలుగు అమలు చేయాలని రాష్ట్ర అధికార భాష సంఘం పూర్వ సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య కోరారు. ఈ మేరకు శనివారం వర్సిటీ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో ప్రతి నెల ఒక సాహితీ కార్యక్రమాన్ని నిర్వహించేలా జిల్లాలోని అన్ని కళాశాలలకు ఆదేశాలివ్వాలన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. తెలుగు అమలకు పాలకమండలి సభ్యులుగా చొరవ తీసుకుంటానన్నారు. జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలలకు తక్షణమే ఆదేశాలు జారీ చేస్తానని వీసీ పేర్కొన్నారు.



వీసీ కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న మూల మల్లికార్జునరెడ్డి, తవ్వా వెంకటయ్య

ఇసుక నూతన విధానంపై హర్షం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఎన్డీయే ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చిన ఇసుక నూతన విధానంపై తెదేపా, భాజపా, జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఒంటిమిట్టలో సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తెదేపా మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహారెడ్డి, బొబ్బిలిరాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బాషా, నాయకులు శివశంకర్‌రెడ్డి, రమణ, ముద్దుకృష్ణారెడ్డి, శివరాజు, గంగిరెడ్డి, మౌలాలి, వీరాంజనేయులురెడ్డి పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

జిల్లా బాధ్య మంత్రితో భేటీ

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : జిల్లా బాధ్యమంత్రి సవితను తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరికృష్ణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పెనుగొండలోని మంత్రి స్వగృహంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని రాజకీయ పరిస్థితి, శాంతిభద్రతలు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



జిల్లా బాధ్యమంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

వేముల, న్యూస్‌టుడే : సాగులో ఉన్న పంటలకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అరటి పరిశోధనా స్థానం తెగుళ్ల నివారణ శాస్త్రవేత్త సునీల్‌కుమార్, పులివెందుల ఉద్యానాధికారి రాఘవేంద్రారెడ్డి సూచించారు. వేములలో సాగులో ఉన్న ఉల్లి, అరటి పంటలను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలతో ఉద్యాన పంటలు నష్టపోకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. తెగుళ్ల నివారణకు ఏయే మందులు వాడాలో సమీపంలోని ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే చర్యలు

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే : ప్రభుత్వం నిషేధించిన పురుగుల మందులను విక్రయించొద్దని దుకాణదారులకు భూసంరక్షణ కేంద్రం అధికారి అనిత సూచించారు. శనివారం పట్టణంలోని పురుగు మందుల, ఎరువుల దుకాణాలను ఏవోలు బ్రెస్లీ, నాగలక్ష్మితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దుకాణాల్లో గ్రిసిల్ మందు విక్రయించవద్దని సూచించారు. అధికారుల సూచనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

పాలకొండ్రాయ స్వామి ఆలయానికి తాళిబొట్ల వితరణ

మారుతీనగర్, న్యూస్‌టుడే : పాలకొండల్లో వెలసిన పాలకొండ్రాయ స్వామికి సీఎంఆర్‌పల్లెకు చెందిన పాలకొండ్రాయుడు, సావిత్రి దంపతులు శనివారం తాళిబొట్లు ప్రదానం చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీధర్ తెలిపారు. భక్తుల విరాళాలతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆలయ ఛైర్మన్ రెడ్డెయ్య తెలిపారు. ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



అర్చకుడికి తాళిబొట్లు అందజేస్తున్న పాలకొండ్రాయుడు

వాననీటితో సతమతం

చెన్నూరు, న్యూస్‌టుడే : కొప్పర్తి పారిశ్రామికవాడకు తెలుగుగంగ నుంచి నీరు తరలించేందుకు తీసిన గోతుల కారణంగా మండల పరిధిలోని శేషయ్యగారిపల్లెలో కాలువలు పూడి ఇళ్లల్లోకి నీరు వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే మురుగు, వాననీరు వెళ్లేందుకు కాలువ ఉండేది. నీటి గొట్టాల ఏర్పాటుకు కొన్ని రోజుల కిందట గుంతలు తీసి, కాలువలను పూడ్చివేశారు. దీంతో వాననీరు ఇళ్లల్లోకి వస్తోందని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.



నీటిని బయటకు తరలిస్తున్న వృద్ధురాలు

బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగితే చర్యలు

వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే : బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని ఎస్సై మంజునాథ తెలిపారు. వీరపునాయునిపల్లె మండలంలోని ఉరుటూరులో శనివారం సిబ్బందితో కలిసి బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగకుండా కంపచెట్లు తొలగించి క్రీడామైదానాన్ని తయారు చేశారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ఆవుల మృతి

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లె పట్టణంలో అధికారుల నిర్లక్ష్యంతోనే ఆవులు మృతి చెందుతున్నాయని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మౌనిబాబా ఆలయం ఎదురుగా శనివారం మృతి చెందిన ఆవుకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో నాలుగు ఆవులు మృతి చెందాయన్నారు. ఆవులు వీధుల్లో తిరుగుతూ వాహనరాకపోకలకు అంతరాయంగా మారాయని వాటిని గోశాలకు తరలించాలని సర్పంచి, ఈవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మునగల చంద్ర, జనసేన నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు.

డీఆర్వో మృతికి సంతాపం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : మండలంలోని చింతరాజుపల్లె ఉప అటవీ క్షేత్రాధికారి కొత్తపేట రామాంజనేయులు (59) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఆయన అన్నమయ్య జిల్లా నందలూరులో నివాసం ఉంటున్నారు. అక్కడి నుంచి చింతరాజుపల్లెలోని అటవీ ప్రాంతంలో విధులకు హాజరవ్వాలని ఇంట్లో సిద్ధం అవుతున్న తరుణంలో ఛాతిలో నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు నందలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. సబ్ డీఎఫ్‌వో స్వామి వివేకానంద, ఒంటిమిట్ట రేంజి కార్యాలయం అధికారులు, సిబ్బంది రామాంజనేయులు మృతదేహానికి నివాళులర్పించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

చింతకొమ్మదిన్నె : మండలంలోని కాంపల్లె, జమాల్‌పల్లె గ్రామాల్లో రూ.45 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. కాంపల్లెలో రూ.40 లక్షలతో సీసీరోడ్డు, జమాల్‌పల్లెలో రూ.5లక్షలతో మురుగు కాలువలు ఏర్పాటు చేయనున్నారు. ఎంపీడీవో కుళాయిబాబు, ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, తెదేపా మండల మాజీ కన్వీనర్ గంధం మోహన్‌బాబు పాల్గొన్నారు.

న్యాక్ పీర్ టీం ఛైర్మన్‌గా శ్రీనివాసులు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : యోగివేమన విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ ఆచార్యుడు బాయినేని శ్రీనివాసులు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) పీర్ టీం ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ బృందం కేరళలోని తిరువనంతపురంలో ఉన్న మహాత్మాగాంధీ డిగ్రీ కళాశాలను ఈ నెల 23, 24 తేదీల్లో సందర్శించనుంది. బృందానికి సమన్వయకర్తగా డాక్టర్ ఎన్ఆర్ మోహన్ వ్యవహరించనున్నారు.

IN THE HON'BLE COURT OF ADDITIONAL SENIOR CIVIL JUDGE, KADAPA
I.P.No. 46/2024

Shek Dasthagiri, S/o Shek Mahabu sahab, aged about 39 years, Muslim, Business, Resident of Door No. 8/1234, Agadi street, Kadapa. **- Petitioner**

Vs

1) T.Mallikarjuna, S/o Not known, aged about 50 years, Chits, Stones Business, Financier, Resident of Elanuru road, Sri Vani school, opp. Diwakar Village, Tadipatri, Ananthapuru District.
2) S.M.Subhan Basha, S/o Not known, aged about 60 years, Proprietor of Subhan Granite and Rehana Granite at Chukkalur road, near Sai Estate, Tadipatri, Ananthapuru District.
3) Y.Jagadeeshwar Reddy, S/o Rama Krishna Reddy, aged about 45 years, Hindu, Business, Door No. 3/722/2/1, Krishnapuram, 4th Road, Tadipatri, Ananthapuru District.
4) S.Mallikarjuna, S/o Not known, aged about 35 years, Hindu, Proprietor Sree Venkateswara Slabs, Ramapuram, Owk Mandalam, Nandyal District.
5) B.Rajesh Kumar, S/o Not known, aged about 45 years, Sri Sainath Stones, Betamcherla, Nandyal District.
6) Naguru Venkat Reddy, S/o Not known, aged about 60 years, Business, Ram granite, Chukkalur road, 40 feet road, Tadipatri, Ananthapuru District.
7) Mayana Ali Nawaz Khan, S/o Mayana Khader Naawaz Khan, aged about 43 years, Business, Door No. 8/1087, Almaspet, Kadapa.
8) Shaik Habeebuddin, S/o Shaik Khader Valli, aged about 62 years, Door No. 7/646, Mochampet, Kadapa.
9) Komali Ramanjineyulu, S/o K.Anjaneyulu, aged about 45 years, Worker, Door No. 13/710, Kalvagadda Street, Tadipatri, Ananthapuru District.
10) Naguru, S/o Not known, aged about 45 years, Muslim, Banaganapalli to Tadipatri road, Ramapuram, Owk Mandal, Nandyal District. **- Respondents**

GENERAL NOTICE TO RESPONDENTS

Please take notice that the petitioner filed insolvency petition No. 46/2024 to declare him as insolvent before the Hon'ble Additional Senior Civil Judge Court, Kadapa against the aforesaid Respondents. The said case is Posted to 28.10.2024 at 10:30 A.M. The above Respondents may appear before the Court either personally or through Advocate failing which the matter will be decided ex-parte.

// BY ORDER OF THE HON'BLE COURT//

Sd/- Shaik Yazdani Basha, Shaik Shabbeer Hussain, Poli Siva Krishna,
Advocates for Petitoner, Kadapa.

రహదారులు అధ్వానం... పొంచి ఉన్న ప్రమాదం

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని పలు ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. నిర్వహణ లోపంతో పిచ్చిమొక్కలతో రహదారులు మూసుకుపోయి ప్రమాదకరంగా మారాయి. చాలాకాలంగా ఈ దుస్థితి నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సిద్దవటం మండలంలోని కమ్మపాలెం నుంచి వెలుగుపల్లె, మూలపల్లె-టక్కోలు-లింగంపల్లె, ఎస్.రాజంపేట నుంచి వెంకటాయపల్లె, నేకనాపురం-బొగ్గిడివారిపల్లె, సాయినగర్ నుంచి బ్రాహ్మణపల్లె వరకు ఆర్అండ్‌బీ రహదారులున్నాయి. మూలపల్లె, సంటిగారిపల్లె గ్రామాల్లోని రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు పెరిగి రహదారిపై వాలాయి. మలుపుల వద్ద పిచ్చిమొక్కలతో రహదారులు మూసుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నాయి. ఎస్.రాజంపేట, వంతాటిపల్లె, జ్యోతి, గొల్లపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో కూడా ముళ్లకంపచెట్లు రహదారులపైకి వాలడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని చెబుతున్నారు. కమ్మపాలెం, జంగాలపల్లె, వెలుగుపల్లె గ్రామాల్లో మలుపుల్లో ముళ్లకంపలు పెరిగి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. నేకనాపురం, పాలకొండ్రాయునిపల్లె, ఆకురోపల్లి, వడ్డేవారిపల్లె, బొగ్గిడివారిపల్లె గ్రామాల్లోని రహదారుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సాయినగర్ నుంచి ముమ్మడిగుంటపల్లె, శేఖరాజుపల్లె, మోహిదీన్‌సాహెబ్‌పల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో రహదారులపై అక్కడక్కడ ముళ్లకంపలతో దారులు మూసుకుపోయాయి. ప్రమాదాలు జరగకముందే ముళ్లకంపలు తొలగించే పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై - ఆర్అండ్‌బీ శాఖ ఏఈ గంగిరెడ్డి స్పందిస్తూ ప్రధాన రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



సంటిగారిపల్లె శివారులో పెరిగిన పిచ్చిమొక్కలు